



# కానుగపూల వాన

గోసిని కరుణాకర్

రాయి రాయి కరిగే యాళైంది. పసిడి గువ్వలు కట్టుకొచ్చినాయి. బాగిచెట్టు గువ్వల కూతలతో మేలుకొనింది. లోకమంతా నిద్దరపోతా వుంటే నేను, బాగిచెట్టు, పసిడిగువ్వలు మేలుకొని వుండాము.

బంగ్యాకు తాగతా గుక్కగుక్కకు సొర్గాన్ని మెట్టు మెట్టుగా అందుకొంటా వుండాను. లచ్చిమి ఇంకా రాలేదు. ఎవుడికి కొంగేసిందో? ఈ రాత్తిరికి వస్తిందో రాదో? ఏటిగెడ్డ నుండే బాలాజీ కొటాయిలో రెండోఆట వొదిలి శానాసేపైంది. ఆకు కదిలినా లచ్చిమి వచ్చిందేమోనని అత్తరమాత్తరంగా చూస్తా ఉండాను. ఎదురు చూసి చూసి కండ్లు కాయలు కాసినాయి. మొనుసు లచ్చిమి కోసరం కట్టుగూటాన పెనుగులాడతా వుండాది. కనమోరి బాయికాడ టెంకాయి మాకులు గలగలా గొంతు కలిపినాయి. నిద్దరమత్తులో చుక్కలు తూగతా వుండాయి. అంకాళమ్మ కొండమింద కొన్ని మోడాలు కూచ్చోని కొండకింద వుండే వూరిని కావలి కాస్తా వుండాయి.

ఈ ఏరు మాకోసమే పుట్టింది. ఏటిగెడ్డ నుండే మొగిలి పొదరింట్లో మిన్నాగులైనాము. ఈ నల్లగుండ్లు మాకు మెత్తని పరుపులైనాయి. ఈ ఏటినీళ్లలో మునిగి ముద్దగ తడిసి, ఆ ఇసిక తిన్నెల మింద సొర్గ నరకాలను అందుకోని ఎన్నోసార్లు వొళ్లు మరిస్తిమి. లోకమంతా నిద్దరపోతా వుంటే మేమిద్దరం మేలుకొని దుత్తలతో ఎన్నెల్ని తాగి పైపెక్కి తూలి ఆడిపాడినాము. మాకు చావుపుట్టుకలు లేవు.

లచ్చిమి లేకపోతే నేను పిచ్చోడినైపోదును! లేదా చేదైపోయిన బతుకును పిందెలోనే తుంచేసుందు. లచ్చిమి వొడిలో మల్లా ఇంగొక జన్మెత్తినాను. బాగి మానుకు కట్టిన ఉయ్యాల గాలికి వూగతా వుండాది. ఆ ఉయ్యాలను దుసారతీగలతో నేను లచ్చిమి అల్లినాము. ఉయ్యాల్లో కూచ్చోని కాళ్లను నేలకు తన్నించి వూపందుకొన్నాను. ఉయ్యాల ఎనక్కు ముందుకు వూగతా వుండాది.

సారాయి వాసన సయిగ్గా ఎనక నుంచి వొచ్చి ఉయ్యాలను దెగ్గిరికి తీసుకొనింది. చేతుల్తో కండ్లు మూసింది. చేతుల్ని తీసేసినాను. లచ్చిమిని చూసి మూతి ముడుసుకొంటిని. చేతుల్తో మెడను చుట్టి చెంపకు చెంప ఆనించింది. తలను చేత్తో తోసేసినాను.

"ఏం వద్దులే తల్లా! ఎంతసేపట్నుంచి నేనీడ నీ కోసరం ఎదురుచూస్తా వుండేది. నా మింద నీకు కనికరమే లేదు," అన్నేను. చిన్నపిల్లగాడి మాదిర్తో అలిగితిని.

మల్లా చెంపకు చెంప ఆనించి,

"పెదబ్బా వచ్చేముందు పరికి కంప మింద చీర ఆరేసినాను. ఇడిపించుకోని వచ్చేసరికి ఈ యాళైంది," అనింది ముద్దు పెట్టుకోని.

"నేనుండాను, నిన్ను సాకలేనా అంటే నువ్వు వినిపించుకోవు. నీ మొండిపట్టే నీది," అన్నేను. నా చేతి నుంచి బుఱ్ఱ తీసుకొని బంగి తాగింది.

"ఈ లోకంలో నువ్వు నాకుండావు. ఇంగేమి కావల్ల చెప్పు?" అనింది.

ఆ మాట నాకు గొంతులో తేనిపోసినట్టు అనిపించింది. లచ్చిమి వచ్చిందంటే పొద్దు మొలిసేది, పొద్దు గూకేది తెలీదు. లచ్చిమి రానంతవరకు పాణం పెనుగులాడతాది. కోపగించుకొంటాను. అలగతాను. ఏడస్తాను.

వచ్చిందంటే ఇవన్నీ మరిసిపూడస్తాను. లచ్చిమిని చూస్తేనే చాలు చెందమామను అందుకొన్నంతగా ఆనందపడిపోతాను. వొళ్లంతా మెరుపు మెరుస్తుంది.

"పెదబ్బా. ఈ రాత్తిరికి పాములమవుదాం. నువ్వు నాగుపాము. నేను పెంజిరి," అనింది లచ్చిమి. బంగ్యాకు మత్తులో ఆయమ్మి కండ్లు తూలినాయి.

చెట్టంతా కట్టుకొచ్చిన గువ్వలతో కేళీఇలాసంగా వుండాది. రాయిరాయి కరిగే ఆ యేళలో నేను నాగుపామునై, లచ్చిమి పెంజిరై ఇద్దరం పొరాడుకొంటా ఏటి గెడ్డ నుండే చెండుమల్లె పూలతోటలోకి పోయినాం.

బాగిచెట్టుకు కట్టిన ఉయ్యాల బంగ్యాకు మత్తులో ఎనక్కు ముందుకు వూగతావుండాది.

*ఉయ్యాల జంపాల వూగేటి తూగేటి ఉయ్యాల*
*ఆ కొండ ఈ కొండ ఉయ్యాల*
*వూగూగి ఆ చెందురుడ్ని అందుకోవల్ల*
*ఉయ్యాల*

లచ్చిమి ఉయ్యాల వూపతా పాట పాడతా వుండాది. ఇప్పటి మాట కాదు ఇది. అప్పుడు లచ్చిమి మా పెద్దవ్వొళ్ల గొడ్లు మేపతా వున్నింది. మద్దేన్నం పూట గొడ్లను మద్దిమాను కింద తోలేసి, కొమ్మలకు వుయ్యాల కట్టి లచ్చిమి మమ్మల్ని వూపేది. శానాసేపు నన్నే వూపతా వుంటే శరాబందిగోడు ఏడస్తా, "నన్ను గూడా వూపక్కా," అని మొత్తుకొనేటోడు. "వుండ్రా పెదబ్బ వూగని," అని వాడ్ని కసురుకొనేది లచ్చిమి. నేను గాన వుంటే వాడికి వూగే ఛాన్సు దొరికేదిగాదు. బడిలేని దినాన గొడ్లకాడికి పోవాలంటే నాకు బలే కుశాల. శరా బందిగోడు లచ్చిమి కడగుట్టి తమ్ముడు. వాడు నా సావాసకోపు. వాడు నేను సంతోపుబడిలో కలిసి సదువు కొంటా వుంటిమి. వాడుగూడా గొడ్లకాడికి వచ్చేటోడు. గొడ్లకాడ వులింజి పొండ్లు, బిక్కికాయలు, బీరపొండ్లు, నేరెడుపొండ్లు పెరికిచ్చేది. నాగదారి పొండ్లో ముల్లు వుంటింది గదా! జగర్తగా తీసిచ్చేది. పొండ్లు పోసుకొని జోబీలు నల్లంగా అట్టకట్టుండేవి.

సాయంకాలం మంగాళచెరువులో గొడ్లను తోలేసి ఆటల్లో పడితే పొద్దుగూకేది తెలిసేది గాదు. వుప్పరపట్టి, తొక్కుడుబిళ్ల, అలసందకాయలులాంటి ఆటలే కాకుండా పుట్టగోసి పెట్టుకోని లచ్చిమి మొగపిలకాయలతోపాటు బలిగూడు కూసేది. జిల్లాంకోడి, పుట్టాచెండు ఆడేది. మొగపిలకాయలని, ఆడపిలకాయలని ఆయమ్మికి తేడా వుండేది గాదు. మొగపిల్లకాయలతో కొట్లాట పెట్టుకొనిందంటే వొక్కసారి ఇద్దర్ని సుట్టుకోని ఇసిరిదెంగేది. కాళ్లసందున దూరి ఎత్తి కుదేసేది. సుమారుపాటి మొగోళ్లకు గూడా ఆయమ్మి బయపడేది గాదు. ఎప్పుడూ గొబ్బుగొబ్బు మాటలు మాట్లాడేది. లచ్చిమికి బలే ధైర్నం. పచ్చారపాము, కట్టిపులుగు, పూడుపాము, నీరుగట్టి పాములను తోకతో పట్టుకోని గిరగిరా తిప్పి ఇసిరి దెంగిందంటే నడుములిరిగి నిగిడి సచ్చేటివి. తమరకట్టెతో ఆ యమ్మి నాగుపాములను బలే న్యాకుగా పట్టేది. నాగపాముల్ని మెడలో ఏసుకోని మమ్మల్ని బయపెట్టేది. మేము బిత్తరపొయ్యి సచ్చేటోళ్లం. వాళ్ల నాయన పాముల చెర్మం వొలిసి అమ్ముకొనేటోడు.

ఆయమ్మి దొంగపనులు గూడా బలే న్యాకుగా చేసేది. పుట్టగోసి పెట్టుకోని టెంకాయ చెట్టు ఎక్కి కాయలు కోసి నిముసంలో దిగొచ్చేది. మనిషెత్తు కల్లను ఎగిరిదూకి మామిడి కాయలు దొంగతనంగా కోసుకొచ్చేది. మేము చెరువులో ఈది నాటకాలు ఆడేవాళ్లం. గుడ్డలతో కిరీటాలు సుట్టుకోని, వీపులకు పరదాలు కట్టుకోని, కట్టెకత్తుల్ని చేత తిప్పతా కంగుంది పద్యాలు పాడతా అడుగులేసేవాళ్లం. ఆయమ్మి ఎప్పుడూ మొగ ఏసికాలు కట్టేది. వొగరోజు ఆయమ్మి ద్రౌపది ఏసికం కట్టింది. మా రవణన్న చీరలతో పాటు ఆయమ్మి లంగా గూడా పెరికేసినాడు. ఆయమ్మి బిత్తలతో మోకాళ్ల మింద కూచ్చోని బలే ఏడిసింది. అప్పటి నుంచి ఆయమ్మి మగ ఏసికాలు మాత్తరమే కట్టేది. మా పెద్దవ్వ బీడీలు తాగేది గదా! ఆమె తాగిపడేసిన తుంట బీడీలను అగ్గిపట్టెలో జాగర్తగా దాంపెట్టుకోని గొడ్లకాడ తాగేది. బీడీలు తాగడం ఆయమ్మికి శానా ఇష్టంగా వున్నింది. తుంటబీడీలు ఎక్కడన్న కనిపిస్తే సాలు తీసుకొని అగ్గిపెట్టెలో అబ్బరంగా దాచి పెట్టుకొనేది. నేను గూడ ఎవురు చూడకుండా బీడీలు తాగడం నేర్చుకొనింది లచ్చిమి వల్లనే! మా పెద్దవ్వ బీడీ ముట్టించుకోని రమ్మని నాచేతికి ఇస్తింది గదా! నేను ఏం చేస్తానంటే, బీడి ముట్టించి ఎవురూ చూడకుండా నాలుగు గుక్కలు తాగి మల్ల తెచ్చి మాయవ్వకు ఇస్తావుంటివి. నాకు అట్లా బీడీలు తాగడమంటే బలే కుశాలగా వున్నింది. మా జయక్క గూడా గొర్రెలకాడికి వచ్చేది. మా జయక్కకు, లచ్చిమికి నిముసంపడేది కాదు. ఎప్పుడూ ఆయమ్మిని "మాదిగి నా సవితి మాదిగి నా సవతి" అంటా వుండేది. అయినా మా జయక్కను లచ్చిమి ఏమి అనేదిగాదు.

"గొమ్మునుండు తల్లే నోరు నొప్పేస్తింది," అని పది మాటలకు వొగ మాట అనేది లచ్చిమి. మా జయక్క కంటే లచ్చిమంటేనే నాకు శానా ఇష్టం. అది మా జయక్కకు కుల్లుగా వుండేది. లచ్చిమి నన్నెంతో ముదిగారంగా చూసుకొనేది. నేను లచ్చిమిని వదల కుండా ముడ్డి సుట్టకారం తిరగతా వుండేటోడ్ని. మా యమ్మ దెగ్గిర, మా చిన్నవ్వ దెగ్గిర ముదిగారం పడినట్టు ఆయమ్మి దెగ్గిర పడేటోడ్ని. లచ్చిమంటే నాకు బలే ఇష్టం. ఎంత ఇష్టమంటే మాయమ్మ పక్కలో నుంచి లేసిపోయి ఆయమ్మి పక్కలో పడుకోవల్లనీ, ఆయమ్మి కతలు చెప్పతా వుంటే వింటా నిద్రపోవల్లనీ, ఆయమ్మి ముద్దలు కలిపి తినిపిస్తా వుంటే తినల్లనీ, ఆయమ్మి చేత్తో నీళ్లు పోయించుకోవల్లనీ వుండేదిగాని కుదిరేది గాదు. ఆయమ్మి కోగిల కూసినట్టు పాటలు పాడేది. లచ్చిమి దెగ్గిర పిల్లనగట్టె వున్నింది. పడుకొన్నెప్పుడు గూడా దాన్ని బొడ్లో చెక్కోని పడుకొనేది. గొడ్లకాడ ఆ యమ్మి పిల్లనగట్టె వూదతా వుంటే అచ్చులు పచ్చులు అలకించేవి. నాకు పిల్లనగట్టె వూదేది నేర్పించమని అడిగితిని.

'ఎంగిలి పెదబ్బా'ని నేర్పించేది గాదు. అయినా నేను వొప్పుకొనేవాడ్ని గాదు. నేర్పిస్తావా, సస్తావా అని మొండికేస్తిని. పిల్లనగట్టెను పావడా గుడ్డకు తుడిసి, ఎట్లా పట్టుకోవాలో, ఎట్లా వూదాలో నేర్పించింది. తొలీతులో వూదడం చేతకాక ఎంగిలంతా వూదేసెటోడ్ని. మా జయక్క చూసి లచ్చిమి మింద చాడీలు చెప్పింది. మాయమ్మ లచ్చిమిని తిట్టి, దూరదూరంగా వుండమని కసురుకొనింది. అప్పటి నుంచి లచ్చిమి నన్ను చేర దీసేది గాదు.

నేను మింద పడితే, "తాకగూడదు పెదబ్బా," అని దూరంగా జరిగేది.

"ఎందుకువేమ్మొ ఎందుకువేమ్మొ," అంటూ నడుమను చేతులతో చుట్టేసి అబ్బిలించుకొనేవాడ్ని.

"మేము మాదిగలం పెదబ్బా," అని అనేది. అప్పుడు ఆయమ్మి గొంతు అదోరకంగా దుక్కంతో వుండేది. అట్లా ఆ పొద్దు నుంచి వాళ్ల తమ్ముడ్ని దెగ్గిరికి చేరదీసినట్టు నన్ను దెగ్గిరికి తీసుకొనేది గాదు. అయినా ఆయమ్మి మింద పడతావుంటిని. వొళ్లో పోసుకొంటా వుంటిని. ఆయమ్మికి సక్కలగిలి పెడతావుంటిని. జుట్టు పట్టుకోని వంగబెరకతా వుంటిని. పాపం నావల్ల ఆ యమ్మి శానా తిట్లు తినేది. వొగరోజు మా పెద్దవ్వొళ్ల ఇంట్లో ముసిలెద్దు వొగటి వల్లగిలి సచ్చి పూడిసింది. దాన్ని వీరతిమ్మ గోడుతీసకపొయ్యి బాగాలు ఏసు కొన్నేరు. అది పంటల కాలం. అబ్బలు బిడ్డలు పొగులు రాత్తిరి కొత్త చెరువు కిందనే వుండేటోళ్లు. లచ్చిమి వాళ్లమ్మ గొడ్డు తునకల కూర చేసుకోని, సంగటెత్తుకోని మాదిగిపల్లె నుండి వచ్చింది.

అబ్బలు బిడ్డలు ఎన్నెట్లో మా పల్లె ముందరుండే చింతమాను కింద కుచ్చోని తింటా వుండారు. నేను చూసేదానికి పోయినాను. తునకల కూర గమగమా వాసన వస్తా వుండాది. సద్ద సంగట్లోకి వుడుకుడు గొడ్డు తునకల కూర అద్దుకొని తింటావుంటే నాకూ నోరూ రింది. నాకు పెట్టమని అడిగినాను.

వాళ్లు పకపకా నగి, "పోపెదబ్బా పో! అమ్మ చూసిందంటే కొడితింది," అనింది వాళ్లమ్మ. నేను మొండి నా కొడుకును గదా! తసికలేసి కుచ్చుంటి ముద్ద పెట్టమని. వాళ్లు భీతిపడిపోయినారు. మా నాయన వచ్చి నవ్వతా చిన్నంగా నా పిర్రలమింద కొట్టి, రానని మొండి కేస్తే భుజాల మింద ఎత్తుకోని ఇంట్లోకి పోయినాడు. పొట్టేలు, కోడికూరైతే తినొచ్చును. గొడ్డుతునకలు తిన గూడదంట. తింటే ఏమైతిందో చూడల్లని చిన్నప్పుడు బలే కోరిగ్గా వుండేది.

మా జయక్కకు బదులు మా చిన్నాయన గొర్రెల కాడికి వచ్చినప్పుడు లచ్చిమిని బలే ఏడిపించేటోడు. తాగేదానికి బీడి ఇచ్చి ఆయమ్మి సండ్లు పిసికేవోడు. అందురూ బాయిలో ఈత కొడతా వుంటారు గదా! మా చిన్నాయన బుడుంగుమని మునిగిపొయ్యి, లచ్చుము రెండు కాళ్లు పట్టుకొని పూడు తగిలేకాడికి తీసకపొయ్యి అదుముకోని వదిలేస్తే, ఆయమ్మి నీళ్లు మింగి కండ్లు తేలేసేటిది. ఈత కొడతా కొడతా ఆయమ్మి రెండు కాళ్ల సందున చెయ్యేసి సక్కలగిలి పెట్టేటోడు. ఆ యమ్మిని ఏడిపించడం మా చిన్నాయనకు బలే కుశాలగా వుండే టిది. మా చిన్నాయన పెద్ద మొగోడు. పెండ్లయిందీ ముగ్గురు బిడ్డలుగూడా! మా జయక్క ఆయన కూతురే! అయినా కూతురు వగిసుండే లచ్చిమితో సరసమాడే టోడు. మా చిన్నాయన అంటే ఆయమ్మి బలే బయ పడేటిది. ఆయన గొర్రెలకాడికి వచ్చిన దినాన ఆయమ్మి వుచ్చలు పోసుకొంటా వుండేటిది. ఒకరోజు ఆయమ్మి వంకబాయి కాడ గడ్డికోస్తా వుంటే వంగదీసుకొన్నాడు. మేము బోడిబండ మీద జారుడు ఆట ఆడుకొంటా చూసినాం. ఆయమ్మి వుచ్చలో పడిన గువ్వపిల్ల మాదిర్తో ఇలిల్లాకొట్టుకొంటా వుండాది. ఈయన పంచె ఇప్పేసి ఆయమ్మి మిందకు వొరగబడినాడు. మమ్మల్ని

చూస్తే కొడతాడని బయపడి బోడిబండ మింద నుంచి దిగేసి పల్లెకు దౌడు తీస్తిమి. ఆ పొద్దుటి నుంచి వాళ్లి ద్దరు వొగటైపోయినారు. మా చిన్నాయన అంటే బయం పొయ్యి శానా ఇష్టపడేటిది. బీడీలు, పూలు, మిఠాయి మా చిన్నమ్మకు తెలీకుండా సంతలో కొనిచ్చేటోడు. నా చేతికిస్తే సయిగ్గా ఎత్తకపొయ్యి ఆయమ్మికి ఇచ్చేవోడ్ని. గొడ్లకాడ ఆయమ్మి మమ్మల్ని వొదిలేసి మా చిన్నాయన సుట్టకారమే తిరిగేటిది. మా చిన్నాయన గొర్రెలకాడకు వస్తాడని తెలిస్తే నన్ను, శరాబందిని పిలసకపొయ్యేటిది గాదు. ఇట్లా కొన్ని దినాలు జరిగింది. ఆయమ్మికి కడు పొచ్చింది. గుట్టు రట్టు కాకుండా మా పెద్దవ్వ ఏం చేసింది? ఆయమ్మిని సయిగ్గా వాళ్లింటికి పంపిం చేసింది.

ఇవన్నీ అప్పుడు నాకు తెలీదు. వొగరోజు ఆ యమ్మి నన్ను వామిలోకి తీసకపొయ్యి "పెదబ్బా ఇంగ నేను రాను. ఇదే ఆఖరు" అని కండ్లనీళ్లు పెట్టుకొనింది. నా చేతిలో చెట్టు పొండు పెట్టి "తిను పెదబ్బా చెట్టు పొండ్లంటే నీకు ఇష్టం గదా" అనింది. అంతే మల్ల ఆ యమ్మిని నేను చూడనేలేదు. ఆ పొద్దుటి నుంచి లచ్చిమి మా పెద్దెవ్వొళ్ల గొడ్లను మేపను రాలేదు.

ఉయ్యాల ముందుకు ఎనక్కు ఊగతా వుండాది. ఆ నింగినీ, ఈ నేలనీ తాకతా వుండాది. చెండుమల్లె పూలవాసన తోటంతా గుమాళిస్తా వుండాది. నడుముల్ని పైకెత్తి బుసులు పెడితిమి. పడగా పడగా రాసుకొంటా కామంతో పైపెక్కితిమి. ఉయ్యాల తీగలు మడతపడినట్టు మోహంతో పెనవేసుకొంటిమి. కేళి ఇలాసంగా తోటంతా పారాడతా వుండాము. మనుషు లుగా పొందలేనిది పాములమై అందుకొంటా వుండాము.

*

కొంతకాలానికి పెద్ద కరువు పెట్టింది. ఆ కరువు లో గొడ్డు గోదను తెగ నమ్మేసి మా నాయన అప్పులు కట్టేసినాడు. బండీ ఎద్దులు మిగిలినాయి. భూమి వున్నంత మాత్తరాన ఏం చేసేది? మన్ను బొక్కులాడలేం గదా! భార్యాబిడ్డలను తీసుకోని పీలేరుకు వచ్చేసినాడు. మాకు బండీ ఎద్దులే ఆధారమైనాయి. బండిని బాడిగ లకు తిప్పేవాడు మా నాయన. ఆ కరువులో మమ్మల్ని రెక్కలు ముక్కలు చేసుకోని సాకినాడు. అప్పుడు నేను పదోతరగతి సదవతా వుంటిని. వొకపక్క సదువుకొంటా గీతా టెక్స్‌లైట్స్‌లో పనికిపోతా వుంటిని. పగలంతా పని చేసి రాత్తిరి పుస్తకం ఎత్తుకోవాలంటే నెత్తికి గుండెత్తు కొన్నట్టు వుండేది. పదోతరగతి పరిచ్చలు ముక్కతా మూలగతా రాసినాను గాని పాసవలేదు. నాకెందుకో సదవాలనిపించేది గాదు. ఇంట్లో వుండాలనిపించేది గాదు. ఇంట్లో దరిద్రం పాతమెట్టుతో కొడతా వున్నింది. వొగపూట సరిగా తినేదానికి తిండి గూడా వుండేది గాదు. మా చెల్లి అయితే ఆకలికి తట్టుకోలేక, "అమ్మా కడుపు నొప్పిమా, కడుపు నొప్పిమా," అనేది. ఎన్నోసార్లు మంచి నీళ్లు తాగి కడుపు నింపుకోని వుండాము.

మాయమ్మ కొంగుతో పొయ్యి రగిలించేది. ఏ నడిజాముకాన్నో ఆకలితో సొమ్మసిల్లిన మమ్మల్ని లేపి అన్నం పెట్టేది. మాయమ్మ అప్పుడు దొంగగొడ్లు తొక్కిన కల్లం మాదిరి వుండేది. అన్నం విస్కీ వాసన కొట్టేది. తమ్ముడు, చెల్లెలు ఆవురావురుమంటా తినేవాళ్లు. నాకైతే కడుపులో తిప్పి వాంతికొచ్చేది. అప్పుడు మా యమ్మ నన్ను బలే కోపంగా చూసేది. అప్పుడు మా యమ్మ అమ్మలా కాకుండా కాళికాదేవి మాదిర్తో వుగ్రంతో వుండేది. అప్పుడు నాకు మాయమ్మంటే శానా బయమేసేది. మానాయన బాడిగకు పోయి వచ్చినా డంటే ఇంట్లో రామరావణ యుద్ధం జరిగేది. కుక్కలు కొట్లాడుకొన్నట్టు మాయమ్మ, మా నాయన అరుసుకొనే టోళ్లు. ఇల్లంతా అగ్గిగుండం తొక్కినట్టు వుండేది. తమ్ముడు, చెల్లీ భీతిపడిపొయ్యి ఇంట్లో వొగమూలన ముడుక్కోని పడుకొనేటోళ్లు. నేను ఇంట్లో నుంచి యల బారిపొయ్యి ఏట్లో వొంటిగా సీకట్లో కుచ్చోని బొరోమని ఏడుసుకొనేవాడ్ని. ఇంట్లో వుండడం కంటే ఎక్కడికైనా యలబారిపోతే బాగుండనిపించేది. ఇంట్లో చెప్పకుండా తిరప్తికి యలబారిపొయ్యి కొన్నాళ్లు హోటళ్లలో పని చేసినాను. లారీలకు ఇసికెత్తినాను. కాళస్తిరిలో అరిటి పొండ్ల మండీలలో కొన్నాళ్లు పనిచేసినాను. వొగచోట వుండాలనిపించేది గాదు. చిత్తూరులో కొన్నాళ్లు, రాణీ పేటలో కొన్నాళ్లు, పూత్తుకోటలో కొన్నాళ్లు, ఇట్లా కాలు కాలిన పిల్లి మాదిర్తో వూర్లు పట్టుకోని తిరిగేవాడ్ని, గుడ్డలు మాసిపొయ్యి, సరైన తిండిలేక, సరైన గుడ్డలేక, నిద్దర పొయ్యేదానికి చోటులేక, పార్కుల్లో, బస్టాండుల్లో, రైలు టేసినీలో, ఫుట్‌పాత్‌ల మింద నిద్దరొచ్చిన చోట వొరిగి పొయ్యే వాడ్ని. నాతోపాటు వుండే తెగిన గాలిపటాలతో బీడీలు తాగడం, పులిజూదమాడడం, దుడ్డు చేతిలో వున్నిందంటే పుల్లుగా తాగడం, లంజిల సావాసం, రైలు పెట్టెల్లో కోరికలు తీర్చుకొనేవాడ్ని. వారాలు తరబడి నీళ్లు పోసుకోక వొళ్లు జిడ్డుజిడ్డుగా చెమట కంపుకొట్టేది. చచ్చి కుళ్లిన ఎలుకల వాసన. లంజిల వొంట్లో పిడికెడు

కండ వుండేది గాదు. ఎముకల గూడు. ఎదమింద రెండు పిడికిళ్ల మాంసం. మీదపడి ఆవురావురుమని తింటావుంటే, పాణాన్ని కండ్లల్లో బిగపట్టేవాళ్లు, చెమట కంపు కలగలిసిన ఆడగాలి బలే మత్తెక్కించేది.

అడ్డమైన రోగాలు, రొచ్చులు, రెండు కాళ్ల సందున పాణాన్ని చేతుల్తో బిగబట్టి నిద్దరపోని రాత్తురులు. మూడోసత్రం కాడ బైరాగులతో కలిసి బంగ్యాకు తాగడంలో బలే మజా వుండేది. బంగ్యాకు మత్తులో సాదువులతో పాటూ నేను, 'మూడునాళ్ల ముచ్చట సిద్ధా! తూట్లు తొమ్మిది తోలుతిత్తిరా!" అని గొంతు కలిపి తత్వాలు పాడేవాణ్ని. సాదువుల మాటల్లో, చేతల్లో, నిలకడైన నిమ్మతి వుండేది. వాళ్ల గొంతుల్లో వూట బావులుండేవి. వాళ్లతో సావాసం చేసినప్పుడు పదిహేడళ్లకే అరవై ఏళ్లు నిండినట్టుండేవి.

అప్పుడప్పుడు అమ్మ, నాయన, గొర్రెల తాత, చిన్నవ్వ, తమ్ముడు, చెల్లి, చింతచెట్ల రెక్కల కింద వొదిగిన పల్లె, నిండుగా నీళ్లతో తొణికిలేసే కొత్తచెరువు వంకబాయి కాడ మడి కయ్యలు, మొగిలిపూల వాసన, మా పెద్దావు కండ్ల ముందు మెదిలేటిది. చిన్నప్పుడు మా నాయన మడక దున్నతా వుంటే, నేను, తమ్ముడు, చెల్లి, మడకసాలులో తేమ మన్నుతో గూళ్లు కట్టుకొనే టోళ్లం. మా చిన్నవ్వ చెనిగి చేనులో మదనకట్టి పెరకతా వుంటే నేను కందిపూల మింద వాలిన సీతాకోక చిలకల్ని 'హుాడని' తోలితే అవి గుంపుగా పైకిలేసి మల్లా ఎన్నిద్రవ పూలమింద వాలేటివి. పొద్దున్నే కోడికూతతో లేసి బారెడు పొద్దు ఎక్కేంతవరకు మా గొర్రెల తాతతో 'గూడ' ఎయడమంటే నాకు బలే కుశాల. మా గొర్రెల తాత, పిచ్చవ్వ వొడ్ల బొత్తలతో (నగ్నంగా) ఎన్నెల్లో తడస్తా గూడేసిన కతను ఎన్నిసార్లు విన్నే తనివి తీరేదిగాదు. మా నాయన బండి తోలతా వుంటే, వొళ్లో కుచ్చోనేదానికి నేను, మా తమ్ముడు కాట్లాడుకొనేటోళ్లం. మా నాయన వళ్లో కుచ్చోని బండిలో పోతావుంటే సంకలు గుద్దుకొనే టంత సంబరంగా వుండేటిది. 'కాగితాలు ఆడ పార దెంగి రారా! ఎంత సదివినా వొంగి వుండాల్సిందే గదా! సేద్దిమైతే మన ఇష్టం. మన రాజ్జెం. మనల్ని అడిగేటోడు వుండడు. వట్టలు ఏలాడేసుకోని, మన్నులో కూరక లాడతా వుంటే వుండే ఆనందం అంతా ఇంతా గాదు." ఇది గొర్రెలతాత మాట.

ఈ మాట నాకు బలే సగించినట్టు వుండేటిది. నేను మడక దున్నతా వుంటే, నేను అండదీస్తా వుంటే, నేను దంతి తోస్తా వుంటే, నేను వాదికుప్ప కొడతా వుంటే, వడ్లు పొలిగాలికి తూరుపు ఎత్తతా వుంటే, నేను వళ్లు మరిసిపొయ్యి సేద్దింపనులు చేస్తావుంటే మా గొర్రెల తాత పిర్రమింద పలక కొట్టినట్టు కుశాలగా వుండేటిది.

అప్పుడు ఆయన చేసే పని వదిలిపెట్టి నన్ను పెగ్గిగా చూస్తా వుండేటోడు. అట్లా చూడడం ఆయనకు బలే ఇష్టంగా, సంతోషాన్ని కలిగించేదిగా వుండేటిది. నా పెద్ద మనవడు సేద్దెంలో మొగలాయి అని మెచ్చుకొంటే నేను మునగచెట్టు ఎక్కి కుచ్చెనేటోడ్ని. మా నాయన గొర్రు తోలతా వుంటే, మా యమ్మ సద్దలు ఇత్తినట్టు, సద్దకంకుల మింద గువ్వలు వాలినట్టు, చిన్నప్పటి గెవనాలు (జ్ఞాపకాలు) నన్ను ముక్కుతో పొడిసి పొడిసి గింజగా ఏరుకొనేటివి. అప్పుడు నేను వొంటిగా వొగ చోట కుచ్చోని గుక్కపెట్టి ఏడ్చుకొనేటోడ్ని. కల చెదిరి పోతుంది. మల్లా పరుగు, పరుగు... తాడులేని బొంగరం మాదిర్తో గిరగిరా పిచ్చిపట్టినట్టు దేశాలు తిరిగి నాను. బందుగుల కళ్లల్లో పురుగునైపోతిని. నలుగురు నోళ్లల్లో 'ఛీబలా' అని నానితిని. నాదొక రోత బతుకు. ఇదంతా మడకసాలులో పుట్టినోడి మనేద.

*

ఆ తరువాత కత ఏమైందంటే? మల్లా మొదటి కొచ్చింది. వొగరోజు మాదిగి లచ్చిమి నా కంట్లో పడింది. నేను అప్పుడు పీలేరులో ఏటిగెడ్డ నుండే బాలాజీ కొటాయి గేట్‌మానుగా పనిచేస్తా వుంటిని. ఎవుడ్నో ఎంటేసుకొని సినిమాకు వచ్చింది. నేను గేటుకాడ నిల బడుకోని టికెట్లు చించతా వుండాను. నన్ను చూసి నిల బడింది. వాడు ఆ యమ్మిని చెయ్యి పట్టుకోని ఈడ్చు కోని పోయినాడు. ఇద్దరూ ఫుల్లుగా తాగేసి వుండారు. సీట్లో కుచ్చోగానే ఆయమ్మిని వాడు వొంగబెరకతాడు. ముద్దులు పెడతాడు. జాకెట్లో చెయ్యేసి సండ్లు పిసక తాడు. వాడి పోరు పడలేక ఆయమ్మి సగం ఆటలోనే పైకి లేసింది. తోసుకొంటా, దొబ్బుకొంటా ఇద్దరూ యల బారి పూడేసినారు. ఇంగొకరోజు రాత్తిరి పదిగంటలకాడ బస్టాండులో కనిపించి పలకరించింది. నిచ్చెన మింద నిలబడుకోని టువలేషీట్ గోడకు అతికిస్తా వుండాను. ఎవురో నిచ్చెన వూపితే కిందకు చూస్తిని గదా మాదిగి లచ్చిమి. గబగబా కిందికి దిగొచ్చినాను.

"ఎన్ని దినాలైంది పెదబ్బా నిన్ను చూసి," అని చెయ్యి పట్టుకొనింది. "ఏంది ఇట్లా పుల్లమాదిర్తో అయి పోయినావే! కంపను పట్టుకొన్నట్టు వుండాది," చెంపల్ని పట్టుకోని అనింది.

నాకు దుక్కమొచ్చింది. కండ్ల నిండుకు నీళ్లు పెట్టుకొంటిని.

''గడ్డము, మీసాలు వొక్కటే తేడా! నువ్వేం మారలేదు పెదబ్బా,'' అనింది.

''ఇన్ని రోజులు యాడికి పోయినావుమ్మే! నీ అతిగతి లేదు,'' అన్నేను.

''అదంతా పెద్ద కతలే పెదబ్బా! ఇప్పుడు ఎందు గ్గాని... దా... ఆ మోరి మింద కుచ్చోని మాట్లాడు కుందాం,'' అంటా నా చెయ్యి పట్టుకోని తీసకపో యింది. ఇద్దరం మోరి మింద గొంతు కుచ్చేన్నాం. రోడ్డు మింద జనం తిరగాడతానే వుండారు. ఆ యమ్మి సారాయి పొట్లం జాకెట్లో నుంచి తీసి, నోటితో కొరికి గుటగుటా తాగింది. నాకు గూడా పాణం పెరికింది. చేతిలో పైసా లేదు. తాగి రొండు దినాలైంది.

''మ్మేయ్ ఇంగొక పొట్లం వుండాదా?'' అన్నేను. రెండు పొట్లాలు తీసిచ్చింది. నోటితో కొరికి అత్తర మాత్తరంగా సారాయిని గొంతులో పోసుకొన్నేక పాణం నిమ్మతి పడింది. బీడి ముట్టించినాను. రెండు గుక్కలు తాగినాక ఆయమ్మి తీసుకొనింది.

''ఆ పొద్దు చెట్టుపొండు చేతిలో పెట్టి మాయ మైనదానివి, ఈ పొద్దు సారాయి పొట్లాలు చేతిలోపెట్టి కనిపించినావు. మల్లా ఇట్లా కలుస్తామని కలలోగూడా అనుకోలేదు తెలుసా?'' అన్నేను.

''నా ముందర ఈ మాట అంటా వుండావు గాని నన్ను ఎప్పుడో మరిచిపొయ్యి వుంటావులే పెదబ్బా,'' అనింది.

''లేదుమే! సత్తింగా, నిన్ను తలుసుకోని రోజు లేదు. అప్పుడు నేనెంత బాధపడినానో తెలుసా? నీ దిగులుతో నాకు జొరం గూడా వొచ్చింది. మా చిన్నా యన నిద్దరపోతా వున్నెప్పుడు నెత్తిన గుండెయ్యాలని గొంతు వరకు కోపం వుండేటిది. నేనే నీకు గుర్తులేను. మా చిన్నాయనను తగులుకోని నన్ను దూరదూరంగా వుంచినావు లంజదానా!''

ఈపు మింద చురుగ్గా వొగ దెబ్బేసినాను. అప్పుడు కోపం ఇప్పుడు తీర్చుకొంటా! ఆయమ్మి ఉలిక్కిపడి, చేత్తో ఈపును తడుముకొంటా,

''అప్పుడు బాకీ, ఇప్పుడు చెల్లయిందిలే పెదబ్బా,'' అని నగింది. ఇద్దరికి మత్తెక్కింది. ఆ యమ్మి పేస్టు పూస్తా, నేను గోడకు పోస్టరు అతికిస్తా, ఆ మాట ఈ మాట మాట్లాడుకొంటా, నవ్వుకొంటా, వొగరి మొగా లకు వొగరు పేస్టు పూసుకోని చిన్నపిలకాయలై పోయినాం.

*

ఆ పొద్దుటి నుంచి మల్లా మేమిద్దరం వొగటై పోయినాం. ఇప్పుడు మమ్మల్ని ఎవురూ అడ్డుకొనే టోళ్లు లేరు. అప్పుడప్పుడూ సినిమాకొచ్చేది. ఎవుడితో నన్నా వస్తే నాతో మాట్లాడేదిగాదు. వొంటిగా వచ్చిం దంటే ఇంటర్వెల్లో ఇద్దరం ఏట్లోకి దిగబడిపొయ్యే టోల్లం. నాకోసమని జాకెట్లో ఎత్తి పెట్టుకొని సారాయి పొట్లాలు తెచ్చేది. గుండ్ల మింద కుచ్చోని తాగేటోళ్లం, పాడేటోళ్లం, ఆడేటోళ్లం, నేను బంగ్యాకు తాగేది చూసి, ఆ యమ్మి గూడా తాగడం మరిగింది. బంగ్యాకు బుర్రను తీసుకొని బీడీని తాగినట్టు తాగేసరికి దగ్గు వచ్చే సింది. అట్లా కాదని చెప్పి, కుడిచేతి నడిమేలు సందున బుర్రను పట్టుకోని, ఎడంచేతి వేళ్లతో బుర్రను బిర్రుగా గుప్పిటపట్టి, నోటి దగ్గిర పెట్టుకోని ఎట్లా తాగాలో నేర్పించినాను. వొగ గుక్క తాగేసరికి ఆ యమ్మికి తల దిమ్మితిరిగి కండ్లల్లో, ముక్కుల్లో నీళ్లు వచ్చేసినాయి. వూపిరాడకుండా దగ్గింది. తలమింద చేత్తో తట్టినాను. తెపరాయించుకోని మల్లా రెండు గుక్కలు తాగింది.

''సారాయి కంటే దీని గాటు నసాలానికి ఎక్కింది పెదబ్బా! కండ్లు తిరగతా వుండాయి. వొళ్లు తేలిపోతా వుండాది. దీని మత్తు బలే కమ్మగా వుండాది,'' అనింది.

''వొగ సాదువు ఏమన్నాడో తెలుసునా? పాణ మంత తియ్యనా, బంగ్యాకు అంత కమ్మన ఇంగేది లేదంట. మ్మేయ్ వొగమాట చెప్పేదా! తాగనప్పుడు ప్రెపంచం తలతో నడిసినట్టు అనిపిస్తింది. వానెక్కా తాగినప్పుడు సక్కరంగా కాళ్లతో నడిసినట్టు వుంటింది,'' అని మూతి బిగపట్టి ముక్కినట్టు నగినాను.

''నువ్వు చెప్పింది నిజమే పెదబ్బా! రెండు పొట్లాలు సారాయి ఏసుకొంటినంటే నాకు మొగిడికి, మిండగాడికి పెద్ద తేడా అనిపించదు. దుడ్డు ఇచ్చినోడికి వొళ్లు అప్పగించేస్తాను. ఎవురో సూదులతో పొడిసినట్టు తెలస్తానే వుంటిది. వొగడు మింద పడి కూరుకులాడ తాడు. ఇంగొకడు పొండ్లతో చెరుకును చీల్చినట్టు చీల్చి, నమిలి నమిలి పిప్పి చేస్తాడు. వొళ్లు మత్తెక్కి వుంటింది గదా! బాద అనిపించదు,'' అనింది.

ఆయమ్మి ఆమాట బలే గొంతుతో అనింది. అట్లా వొగరి కష్టసుఖాలు వొగరు పంచుకొంటా, ఎన్నో రాత్రులు ఆ ఏట్లో గడిపినాం. ఈ ప్రెపంచంలో మాకు ఎవురూ లేరు, నాకు లచ్చిమి, లచ్చిమికి నేను తోడునీడ

అనిపించేది. ఆ ఏరు, ఆ కొండలు, ఆ కానగచెట్లు, ఎన్నెల, చీకటి, చుక్కలపందిరి మా సావాసకోపులు, ఇసిక తిన్నెల మింద అలసిసొలసినాం. వొగరి మింద వొగరు నీళ్లు ఎగరజల్లుకొంటా చిన్నపిలకాయలమైనాం. ఇసిక గూళ్లు కట్టుకొన్నాం ఏట్లో, ఎన్నెట్లో.

వొగరోజు రెండో ఆట బుకింగ్ క్లోజ్ అయినాక ఇద్దరం జొన్నగెడ్డలోల్ల మిషను కాడ పొట్టుగాడిలో కుచ్చెన్నాము. ఆడికి పురుగు గూడా రాదు.

చుట్టలు నంజుకొంటా సారాయి తాగినాం. బంగ్యాకు తాగి మత్తులో వూగితూగినాము. వంట్లో దెయ్యాలు దూరినాయి. ఆడగాలి తగలక వొళ్లు తిమ్మి రెక్కి వుండాది. సారాయి, బంగ్యాకు కలగలిసిన మత్తు, వొంట్లో తైతెక్కలాడతా వుండాది. చేతులతో అదుము కొంటిని. ఆ యమ్మి 'వూ' అనలేదు 'ఆ' అనలేదు.

చెనిగిపొట్టులో పోర్లించినాను. ఎచ్చెచ్చగా మంట రగలుకొనింది. మెడ మింద ముద్దులు సెగలు కక్కతా వుండాయి. ఆ యమ్మి చేతులు ఈపును పెంజిరి పాములై చుట్టుకొన్నేయి. తొడలకాడ కుచ్చోని ఆవు రావురమంట పులిబోజనం చేస్తా వుండాను.

వున్నెట్టుండి ఆయమ్మి నన్ను పక్కకు తోసేసింది. మొకాళ్ల మింద తలపెట్టుకొని బొరోమని ఏడిసింది. వురుములు మెరుపులతో వాన కురిసినట్టు వుండాది ఏడుపు. వొళ్లు సచ్చుబడిపోయింది. ఆయమ్మిని రెండు చేతుల్తో ఆదుముకొంటిని. వొళ్లంతా గడగడా వొణకతా వుండాది. కండ్లల్లో నీళ్లు కమ్ముకొచ్చినాయి. నన్ను పసి బిడ్డను చేసి వొళ్లో పండబెట్టుకొనింది. మొగమంతా ముద్దులు పెట్టింది. చెంపకు చెంప ఆనించి, బొట బొటా కండ్లనీళ్లు పెట్టుకొనింది.

*

ఆ రాత్తిరి అట్లా గడిచింది. మరుసటిరోజు రాత్తిరి నన్ను ఏట్లోకి పిలుసుకోని పోయింది. చేతులు పట్టుకోని నీళ్లు దాటి నల్లగుండ్ల మింద కుచ్చెన్నాం. మూగ ఎన్నెట్లో నల్లగుండ్లు నెమరేసుకొంటా వుండాయి. ఏటింటి కానగ పూల వాన.

కొనగుండు మింద లచ్చిమి కుచ్చోనుండాది. ఆ యమ్మి కాళ్ల కాడ నేను కుచ్చోనుండాను. లచ్చిమి వొళ్లు సాదీనం తప్పేట్టు తాగుండాది. కండ్లు నిప్పులై కణకణ రగలతా వుండాయి. బంగ్యాకు అరిచేతిలో నలిపి బుర్రకు మెత్తిచ్చినాను. అగ్గిపుల్ల గీసి ముట్టించి వూపిరి బిగపట్టి 'బీర్సి'నాను. ఆకు రగులుకొనింది. కాలిన ఆకు వాసన ముక్కలకు కమ్మగా తగిలింది. బుర్రను వాటంగా పట్టుకోని రెండు గుక్కలు తాగినాను. వొళ్లంతా ఎచ్చంగా వుక్కబోసింది. కండ్లల్లో చుక్కలు మొలిసినాయి. నా చేతిలో నుంచి ఆయమ్మి బుర్రను అందుకొనింది.

నేను ఆయమ్మి దెగ్గిరికి జరిగి ఆయమ్మి పాదల మింద తలపెట్టుకోని, "మ్మేయ్ నేను శానామంది ఆడోళ్లతో సావాసం చేసుండాను. నీ అంత దెగ్గిరిగా నాకు ఎవరు అనిపించలేదు," అన్నేను.

రెండు గుక్కలు పొగ తాగి, "పెదబ్బా నీకు నా కత చెప్పతాను ఇంటావా?" అని అడిగింది. కాళ్ల మించి నుంచి తల పైకెత్తి ఆయమ్మి కల్లా చూసినాను.

"మూడు నెలల కడుపుతో వుండే నన్ను మా నాయన పదిట్ల బైలు మాదిగిపల్లెలో వొగ తిక్కలోడికిచ్చి పెండ్లి చేసినాడు. సంవత్సరం తిరక్కముందే బిడ్డను కని ఆడ పారేసి లారీ డైవోరుతో లేసి పోయినాను. వాడు నన్ను పుల్లాకును చేసి మోజు తీరినాక వొదిలేసినాడు. వాడికి వొగ మొగబిడ్డను కంటిని. మల్లా తిక్కల మొగుడి పంచన చేరితిని. ఇద్దో ఇట్లా వొళ్లమ్ముకోని ఇద్దరి బిడ్డల్ని, తిక్కల మొగుడ్ని సాకతా వుండాను.

"నా మొగుడు పిచ్చోడు. వుమాదం పూనితే కల్లు తాగిన కోతి. నా మింద పడతాడు. పారతో మన్ను తవ్వి నట్టు నన్ను గుంతలోడిపెడతాడు. వొక్కొక్కసారి కట్టె తీసుకోని పిలగాడ్ని కొట్టినట్టు కొట్టేస్తాను. వొక్కొక్కసారి వాడిదీ వుప్పుకారం తినేవొళ్లే గదాని నన్ను గుంతలోడి పెడతావుంటే వూపిరి బిగపట్టి వుండిపోతాను. ఏం చేసేది తిక్కలోడుగదా!" పైటతో కండ్లనీళ్లు తుడుసు కొనింది. రెండు గుక్కలు బంగ్యాకు తాగింది. "పెదబ్బా! తెలిసీ తెలియని వొగిసిలో చెయ్యేసిన మీ చిన్నాయన నుంచి, నీ వరకు గూడా ఎందరికో కొంగేసుండాను. ఎవురి కింద పడుకొన్నే నేను రాయినైపోతినిగాని ఆడ దాన్ని కాలేకపోతి. నువ్వంటే నాకు పాణం పెదబ్బా! నిన్ను ముట్టుకోవాలని, వాటేసుకోవాలనీ, ముద్దు పెట్టు కోవాలని కోరిక వుంటింది. నిన్ను ముట్టుకోగానే రాయి నైతా వుండాను. ఇట్లా మనుషులుగా వుంటే నిన్ను నేను తాకలేను. రాయి రాయి కరిగే వొగ యేళ వుంటిందంట. ఆ యేళలో గువ్వలమైపోదాం. గుర్రాలమైపోదాం. నీళ్లల్లో చేపలమై పోదాం. మన ఇద్దరికి అడ్డులే వుండవు," అనింది.

ఆయమ్మి మాటలు నాకు ఇచ్చిత్తరంగా అని పించినాయి.

"పెదబ్బా రాయి రాయి కరిగే యేళలో పసిడి గువ్వలు కట్టుకొస్తాయి. పోతుగువ్వ కూతేసి పెంటి గువ్వను పిలిస్తింది. కట్టుకొచ్చినప్పుడు అవి బంగారు వర్ణంలో ధగధగా మెరస్తా వుంటాయి. బాగి చెట్టులోనే గూళ్లు కట్టుకొంటాయి. అవి దేవుని గువ్వలు," అని చెప్పింది.

ఆ ఏటిగెడ్డన పెద్ద బాగిచెట్టు వొగటి వుండాది. చేయి పట్టుకోని ఆ చెట్టు కిందకు నన్ను పిలుచుకోని పోయింది. కొమ్మల మింద వొదిగిన పసిడిగువ్వలు బంగారంలో ముంచి తీసినట్టు ధగధగా మెరస్తా వుండాయి. సరిగ్గా రాయి రాయి కరిగి యేళలో అవి కట్టుకొచ్చినాయి. పోతుగువ్వల కూతలతో జివ్విచెట్టు నిద్దట్లో వులిక్కిపడింది. ఇద్దరం చేయి చేయి పట్టుకోని రెండు గుఱ్ఱాలమై ఏటింటి దౌడు తీసినాము. అద్దులు లేని లోకంలో కేళిఇలాసంగా తిరిగి కరకరా పొద్దు మొలిచేసరికి మల్లా మనుషులమైపోయినాము. ఇంగొక రాత్తిరి చేపలమై నీటి సారికలను రాసుకొంటా ఈది ఈది ఏటి కంటిలో అలసిసొలసినాము. పచ్చులమై ఎగిరిపయి నల్లమోడాలను ముక్కులతో పొడిసినాము. జల్లున వాన కురిసింది. సీతాకోకచిలకలమై పూలతేనే తాగి తైతెక్కలాడినాము. నెమళ్లమై పురులు విప్పి అడితిమి. కోగిలమై గొంతులు విప్పి పాడితిమి. చీమలమై, ఏనుగులమై, పులులమై, జింకలమై ఎన్నో రాత్తురులు ఏటిగెడ్డన గడిపితిమి. లచ్చిమి నేను వొగటై నాక వూరును యెలేస్తిమి. ఏటిగెడ్డన ఈ బాగిచెట్టు మాకు ఇల్లయింది. ఈ ఉయ్యాల్లో వూగతా వూగతా ఏడేడు లోకాలను అందుకొంటిమి.

*

కరకరా పొద్దు మొలిచేది మరిస్తిమి.

పూలుకోసే ఆడోళ్లు, మగోళ్లు బుట్టలు పట్టుకోని వచ్చినారు. వొగ ఆడది మమ్మల్ని చూసి బిత్తరపొయ్యి పాములని అరిసింది. మొగోళ్లు గబగబా పరిగెత్తుకొంటా వచ్చినారు. దడికి కట్టిన గూటాన్ని తీసుకోని వొకడు పెంజిరి తల మింద వొగ దెబ్బ ఏసినాడు. ఇంగొకడు నన్ను కొట్టేదానికి గూటాన్ని పైకెత్తినాడు. 'నీయమ్మా నాయాల! నాగుపామును సంపొద్దురా పాపం,' అన్నేడు వాళ్లల్లో వొకడు అడ్డుపడి.

వాడు నా పైకి ఎత్తిన గూటాన్ని పక్కకు తిప్పి పెంజిరిని దెబ్బకొట్టినాడు. దెబ్బమింద దెబ్బ పెంజిరి మింద పడతావుండాయి. పెంజిరిని సంపేస్తా వుండారు నా కొడుకులు, కోపంతో బుస్సుమని పడగవిప్పితిని. వొగని కాలును కాటేస్తిని. వాడు బిత్తరపొయ్యి 'అమ్మా' అని భీతరపు అరిసినాడు. ఇంగొకడు గూటాన్ని నా పైకి ఎత్తినాడు. దెబ్బ తప్పించుకొని పక్కనే ఎలకబొక్క వుంటే దూరేసినాను. కాటుపడిన వాడ్ని ఎత్తుకొని కాసర బీసరని అరుసుకొంటా అందరూ పూడిసినారు. ఎలక బొక్కలో నుంచి బయటకొచ్చినాను. పెంజిరి కొన పాణంతో కొట్టకలాడతా వుండాది. మనిషినై పెంజిరిని తీసుకొంటిని. చేతుల్లో పెంజిరి పాణాలు వొదిలింది. మెరుపు మెరిసినంతలో అంతా ముగిసిపోయింది. 'లచ్చిమి లచ్చిమి' ఎద కొట్టుకొంటిని. పిచ్చిపట్టినట్టు ఏరంతా పరిగెత్తితిని. ఇసికలో మోకాళ్ల మింద కుచ్చోని గుండె పగిలేట్లు ఏడిస్తిని.

దిక్కులు దొని పలికినాయి. ఏరు నీళ్లను ఇర బోసుకోని వలవలా ఏడిసింది. గాలి సుడిగాలై రోదించింది. ఆకాశం బోరున దుక్కపడింది. పొద్దు మొలిసింది. పెంజిరిని ఏటిగెడ్డన గుంతలోడి పూడ్చిపెట్టినాను. ఏటిగెడ్డన సొలువుగా కానగచెట్లుండాయి. ఆ మాకుల్లో నేను వొగ కానగ మాకునైపోతిని.

*తెలుగుకథ డాట్‌కామ్, మార్చి 2000*

